

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్
ఎపీడీ దామోదర్‌రావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తాటియాకులగూడెం పంచాయతీలో ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గంధం బోస్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.దామోదర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే గ్రామానికి చెందిన కె.సాయి 'స్పందన' కార్యక్రమంలో పలు దఫాలు ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. పనికి రాని వారికి మస్తర్లు వేస్తూ చిన్న పిల్లలతో ఉపాధి హామీ పనులు చేయిస్తున్నట్లు, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తేలింది. దీనిపై ఎపీడీ జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు ఎపిఒ జాన్‌వెస్లీ తెలిపారు.

దాళ్వాకు నీళ్లిస్తారా..!



- ఇంకా జరగని జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం
- గోదావరి జలాలపై తర్జనభర్జనలు
- సీలేరు, పోలవరం ప్రాజెక్టు వద్ద నీటి నిల్వలపైనే ఆధారం
- రెండు జిల్లాలకు దాదాపు 70 టిఎంసిలు అవసరం
- ఖరీఫ్‌లో కరువుతో తీవ్రంగా నష్టపోయిన రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

దాళ్వాసాగుకు నీటి సరఫరాపై ఇప్పటికీ ప్రభుత్వం తేల్చలేదు. ఖరీఫ్ మాసూళ్ల ప్రారంభమయ్యాయి. దాళ్వా నారుమడులు వేసేందుకు మరోపక్క రైతులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకూ దాళ్వాలో సాగునీటికి సంబంధించి జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం జరగనేలేదు. పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరిస్తారా.. లేక ఆంక్షలు ఏమైనా విధిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాళ్వాలో 4.60 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆయకట్టు పరిధిలో 4.36 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. రెండు జిల్లాల్లోనూ దాళ్వాసాగుకు పూర్తిస్థాయిలో నీరందించాలంటే 70 టిఎంసిల వరకూ నీరు అవసరం. వరద నీటి ప్రకారం గోదావరి నుండి లభ్యత అంచనాలు 36 టింఎంసిల వరకూ ఉండే అవకాశం ఉంది. సీలేరు నుంచి ఎంత లభ్యత ఉంటుందో, పోలవరం ప్రాజెక్టు వద్ద నిల్వ ఉన్న నీటిని దాళ్వాకు ఉపయోగించేందుకు ఇరిగేషన్ అధికారులు లెక్కలు కడుతున్నట్లు తెలుస్తోంది. సాగునీటికి సంబంధించి లెక్కలపై స్పష్టత వస్తే తప్ప దాళ్వా పరిస్థితి ఏమిటో అర్థం కాదు. కొంతకాలంగా వంతులవారీ విధానంలో దాళ్వాకు సాగునీరు అందిస్తున్నారు. జనవరి దాటిన తర్వాత సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాల విభజన అనంతరం రెండు జిల్లాల్లో దాదాపు 3.50 లక్షల ఎకరాల వరకూ దాళ్వాలో వరి సాగవుతోంది. ఈ సాగుకు నీరెలా అందిస్తారో ప్రణాళికలు ఇప్పటికీ వెల్లడించకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ సాగులో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. దిగుబడులపై సైతం తీవ్ర ప్రభావం పడనున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ తరుణంలో దాళ్వాలో సాగునీటి ఇబ్బందులు తలెత్తితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడనుంది. దాళ్వాలో సాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కష్టాల సుడిలో అన్నదాత

ఖరీఫ్‌లో వర్షాలు పడక పంటలపై తీవ్ర ప్రభావం పడింది. ఏలూరు జిల్లాలో లక్షా 98 వేల ఎకరాల్లో వరిసాగు సాగగా ప్రాథమిక అంచనాల్లో 12 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు స్పష్టమైంది. ఇంకా పరిస్థితి మరింత దారుణంగా ఉండనుందని తెలుస్తోంది. పెట్టుబడులు పెట్టిన పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఇప్పటి వరకూ జిల్లాలో ఏఒక్క మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకుండా తాత్సారం చేస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఖరీఫ్‌లో 2.10 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండల తీవ్రతకు దిగుబడులు తగ్గనున్నట్లు రైతులు అంచనా వేస్తున్నారు. దీంతో దాళ్వా సాగుపైనే రైతులంతా గంపెడాశలు పెట్టుకున్నారు. దాళ్వాసాగుకు నీటి సరఫరాపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అప్పుడే రైతులు ప్రశాంతంగా ఉంటారు. ఈ నెల 14న ఏలూరు జిల్లాలో సాగునీటి సలహా మండలి సమావేశం జరగనున్నట్లు చెబుతున్నా అధికారికంగా మాత్రం ప్రకటన వెలువడలేదు. దాళ్వాకు సాగునీటిపై ఇరిగేషన్ జిల్లా అధికారి వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


వినతులు స్వీకరిస్తున్న జెసి లావణ్యవేణి

అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు
జెసి లావణ్యవేణి - 'జగనన్నకు చెబుదాం'లో 118 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి - లింగపాలెం

జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీల పరిష్కారం నాణ్యతతో ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం ధర్మాజీగూడెంలోని ప్రసాద్ ఫంక్షన్ హాలులో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్, ఎఎస్‌పి భాస్కరరావు, వ్యవసాయశాఖ జెడి రామకృష్ణ, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ ఎస్.నిర్మలాజ్యోతి, పశుసంవర్ధకశాఖ జెడి జి.నెహ్రూబాబుతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 118 అర్జీలు వచ్చాయని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందినుద్దేశించి మాట్లాడుతూ మండలంలో కొంతమంది సచివాలయ సిబ్బంది జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. వచ్చిన ప్రతి అర్జీ క్షుణంగా చదివి నాణ్యతతో కూడిన పరిష్కార ఎండార్స్‌మెంట్ ను అర్జీదారులకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రీఓపెనింగ్ అర్జీలు కూడా ఈ మండలంలో ఎక్కువగా వస్తున్నాయని, దీనిపై సంబంధిత సచివాలయ సిబ్బంది అశ్రద్ధ కన్పిస్తోందని చెప్పారు. మండలంలో సదరంకు సంబంధించిన అర్జీలు రావడంతో వెంటనే శిబిరం ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించిన అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జెసి హెచ్చరించారు. ధర్మాజీగూడేనికి చెందిన జయరాజు గ్రామంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని అర్జీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.ఆశ్వీరాదం, తహశీల్దార్ మురళీకృష్ణ, లిడ్‌క్యాప్ రాష్ట్ర డైరెక్టర్ సందీప్, ఎంపిటిసి మేకల రాజ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరి సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - భీమడోలు

విజయవాడలో ఈ నెల 15న నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు కోరారు. ప్రచార యాత్ర శుక్రవారం మండలంలోని పూళ్ల, కురెళ్లగూడెం, భీమడోలు, పాతూరు, గుండుగొలను గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించగా లింగరాజు మాట్లాడారు. అనంతరం సిపిఎం బృందం ధాన్యం ఆరబోస్తున్న రైతులను కలిశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులను ఆదుకునేందుకు తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కొర్ని అప్పారావు, మానుకొండ వీర్రాజు, జి.గోపీ, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.


ధాన్యం రైతులతో మాట్లాడుతున్న నేతలు

ద్వారకాతిరుమల: కేంద్రంలోని బిజెపి పట్ల రాష్ట్రంలోని ప్రధాన ప్రధాన పార్టీలు రాజీ పడుతూ, రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలేశాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు విమర్శించారు. ప్రజారక్షణ భేరి ప్రచార యాత్ర శుక్రవారం ద్వారకాతిరుమల చేరుకుంది. ద్వారకాతిరుమల, తిమ్మాపురం, గొల్లగూడెం, పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి తదితర గ్రామాల్లో యాత్ర సాగింది. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ పోలవరానికి నిధులివ్వకుండా అమరావతిని నాశనం చేసినటువంటి బిజెపికి ఎందుకు మద్దతిస్తున్నారో బహిరంగంగా చెప్పాలని ఈ మూడు పార్టీలను ఆయన డిమాండ్ చేశారు. కేవలం తమ కుర్చీలు, కేసుల కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఢిల్లీలో తాకట్టు పెట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో నేతలు మానుకొండ వీర్రాజు, జినగం గోపీ, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా
2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపెయిన్
కలెక్టర్ ప్రసన్నవెంకటేష్



ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండాలనే లక్ష్యంతో ఓటర్ జాబితా తయారీలో అందరూ భాగస్వాములు కావాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కోరారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఆయా పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా ప్రక్రియ, ఓటింగ్ యంత్రాల పరిశీలన తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ ఓటరు జాబితాను పకడ్బందీగా పారదర్శకంగా రూపొందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు కోసం డిసెంబర్ 9వ తేదీ వరకు సమయం ఉందని, ఈ నెల రోజుల్లో అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అన్నారు. ఓటర్ల జాబితాలో లోటుపాట్లు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో పోలింగ్ స్టేషన్ల పరిధిలో బిఎల్‌ఒల సమక్షంలో ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తారన్నారు. ఎక్కడైనా బిఎల్‌ఒలు హాజరు కాకపోతే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జనవరి 5న ఓటర తుది జాబితా ప్రకటిస్తారని చెప్పారు. జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల నాటికి 15 లక్షల 88 వేల 622 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్‌లో ఫారం-6 కింద 7179, ఫారం-7 కింద 1671, ఫారం-8 కింద 2943 మొత్తం 11793 దరఖాస్తులు అందాయన్నారు. ఓటింగ్ యంత్రాల తనిఖీ పూర్తయ్యిందని చెప్పారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, నేతలు నెరుసు నెలరాజు (బిజెపి), సిర్రా భరత్‌రావు (బిఎస్‌పి), పి.ఆదిశేషు (సిపిఎం), ఎస్.బాబూప్రసాద్ (కాంగ్రెస్), ఆర్.సత్యనారాయణ (ఆమ్‌ఆద్మీ), పాలి ప్రసాద్ (టిడిపి), కెఎస్.సాంబ (వైసిపి), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్నదొర తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి

సచివాలయం స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. శుక్రవారం స్పోర్ట్స్ సెక్రటరీ పిఎస్.ప్రద్యుమ్న, స్పోర్ట్స్, స్పెషల్ సెక్రటరీ రేవు ముత్యాలరాజు 'ఆడుదాం ఆంధ్రా' టోర్నమెంట్ నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో విజయవాడ నుండి రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వైస్ ఛైర్మన్, ఎమ్‌డి హెచ్‌ఎం.ధ్యానచంద్ర పాల్గొనగా ఏలూరు నుండి డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోనస్ ఇవ్వాలని జ్యూట్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దీపావళికి బోనస్ ఇవ్వాలని కోరుతూ శ్రీ కృష్ణ ఏషియన్ జ్యూట్‌మిల్లు కార్మికులు కొత్తూరులో మిల్లు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి టిఎన్‌టియుసి అధ్యక్షులు కె.ఉమాశంకర్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాథం, ప్రధాన కార్యదర్శి సాయిబాబా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దీపావళికి ముందు పండగ బోనస్ ఇచ్చేవారని, అయితే ఈసారి యాజమాన్యం బోనస్ ఇవ్వలేమని నోటీసు బోర్డులో పెట్టారని తెలిపారు. ఇది దారుణమన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. యాజమాన్యం బోనస్ ఇచ్చేలా కార్మిక శాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ ఆళ్ల నాని జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తూరు జ్యూట్‌మిల్లు డైరెక్టర్ శంకర్ గోపాల్‌లునాని కార్మికుల వద్దకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్‌కు, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మిల్లు పర్సనల్ మేనేజర్ సురేష్ కార్మికులతో మాట్లాడుతూ కార్మికులకు నెల రోజుల్లో బోనస్ ఇచ్చేలా యాజమాన్యంతో మాట్లాడతానని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు. కార్యక్రమానికి తిరుపతి స్వామి, అప్పారావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రాము, చిన్న నాయకత్వం వహించారు.


నినదిస్తున్న నేతలు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

నగర పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు మండలాధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెరిగిన జీతాల ఎరియర్స్, స్వీపర్లకు హెల్త్ అలవెన్స్ కోట్లాది రూపాయలు బకాయిలు రావాల్సి ఉందన్నారు. చింతలపూడి నగర పంచాయతీలో సుమారు 80 మంది కార్మికులు వివిధ పనుల్లో ఉన్నారన్నారు. వీరికి సెలవులు సైతం చట్టప్రకారం మంజూరు చేయడం లేదని, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో అదనపు పని భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీగా ఏర్పడి మూడు సంవత్సరాలవుతున్నా కార్మికులకు నేటికీ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం వర్తింపజేయకపోవడం దారుణమన్నారు. కమిషనర్ అదనపు పోస్టుల కోసం ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సమస్యలను సత్వరం పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన చేపడతామని, అవసరమైతే సమ్మెకు సైతం సిద్ధమని స్పష్టం చేశారు. అనంతరం కమిషనర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నేతలు, కార్మికులు

17న సిఎం నూజివీడు రాక
ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి, ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - నూజివీడు

ఈ నెల 17న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు, జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతితో కలిసి ఆ ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఈ నెల 17న అసైన్డ్ భూములకు సంబంధించిన భూహక్కు పత్రాలను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నూజివీడు విచ్చేస్తున్నారని, ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు నిర్దేశించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వర్తించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు అనువైన స్థలాన్ని నిర్ణయించేందుకు సారధి ఇంజినీరింగ్ కళాశాల, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ప్రాంగణం, జగనన్న ఎంఐజి టౌన్‌షిప్ ప్రాంగణాన్ని, బైపాస్‌లో స్టేడియం నిర్మాణ స్థలాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్, ట్రెయినీ కలెక్టర్ శ్రీపూజ, అదనపు ఎస్‌పి భాస్కర్, డిఎస్‌పి అశోక్‌కుమార్‌గౌడ్, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇలు జాన్‌మోషే, సత్యనారాయణ, వ్యవసాయ శాఖ జెడి వై.రామకృష్ణ, ఎపి స్టేట్ కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, కార్పొరేటర్ శీలం రాము, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

సమస్యల పరిష్కారంపై ముందే ఆరా తీయాలి
సర్వసభ్య సమావేశంలో భీమడోలు ఎంపిపి కె.రామయ్య

ప్రజాశక్తి - భీమడోలు

ప్రజాప్రతినిధులు ప్రతి మూడు నెలలకు జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు హాజరు కావడానికి ముందు తాము గత సమావేశంలో లేవనెత్తిన సమస్యల పరిష్కారం గురించి ఆరా తీయాలని ఎంపిపి కనమాల రామయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. అతిథిగా జెడ్‌పిటిసి తుమ్మగుంట భవానిరంగా హాజరయ్యారు. ఎంపిడిఒ పద్మావతిదేవి పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు గత సమావేశ సమస్యల పరిష్కారం గురించి ప్రస్తుత సమావేశంలో చర్చిస్తే దానివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదన్నారు. ఈ మధ్యకాలంలో సమస్యలు ఏ మేరకు పరిష్కారమయ్యాయనే దానిపై ప్రజాప్రతినిధులు సమీక్షించాలని, దీనిపై అవసరమైతే తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. మండల పరిషత్ ద్వారా అమలవుతున్న వివిధ పనులు ఎం.పుస్తకంలో నమోదు చేయడంలో భీమడోలు మండలం జిల్లాస్థాయిలో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుందన్నారు. నిధులు విడుదలవ్వగానే వాటి చెల్లింపులు జరుపుతామన్నారు. గృహనిర్మాణ సంస్థ ద్వారా 82 శాతం ఇళ్ల నిర్మాణం ప్రగతి ఉందని, మిగిలిన లబ్ధిదారులు సైతం నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. మండల పరిధిలో విద్యుత్ సమస్యలు ఆశించిన స్థాయిలో పరిష్కారం కాకపోవడానికి గ్రామ సచివాలయాల్లో పనిచేసే విద్యుత్ సిబ్బంది సక్రమంగా పనిచేయక, తమ సహకారాన్ని అందజేయకపోవడమే కారణమని ఆయన ఆరోపించారు. దీనిని సరి చేసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంపై ఆసక్తి లేని లబ్ధిదారులకు కేటాయించిన పట్టాలు రద్దు చేసి ఆసక్తిగల ఇతరులకు పట్టాల పంపిణీపై ఎంఎల్ఎతో చర్చిస్తానన్నారు. కోఆప్షన్ సభ్యులు ఆజం మాట్లాడుతూ గతంలో నిర్మించుకున్న ఇళ్లు శిథిలావస్థకు చేరడంతో గృహనిర్మాణ సంస్థ 2006లో వాటి మరమ్మతులకు రూ.ఆరు వేలు చొప్పున కేటాయించిందని, ప్రస్తుతం లబ్ధిదారులు ఆ మొత్తాలను తిరిగి చెల్లించి తమకు నూతన యూనిట్ మంజూరు చేయాలని కోరుతున్నారని తెలిపారు. ట్రాన్స్‌కో భీమడోలు ఎఇ రామస్వామి మాట్లాడుతూ మండలంలోని 32 జగనన్న లేఅవుట్లలో ఇప్పటి వరకు 25 లేఅవుట్లలో విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. ఆర్‌టిఎస్ఎస్ విధానంలో నిధుల మంజూరులో జాప్యం జరుగుతుందన్నారు. గతంలో నిధులు నేరుగా విడుదల కావటం వల్ల పనులు వేగవంతంగా జరిగేవన్నారు. ఉపాధి హామీ ఎపిఒ పద్మ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గ్రామసభల ద్వారా రూ.16.40 కోట్లు విలువైన పనులు చేపట్టేందుకు అవకాశమున్నట్లు గుర్తించామన్నారు. ప్రతి మూడు నెలలకోసారి గ్రామ సభ నిర్వహించి జాబ్‌కార్డుల లబ్ధిదారులను గుర్తిస్తామని తెలిపారు. ఎంఇఒ భాస్కర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా భీమడోలు కేంద్రంగా స్కిల్ హబ్ మంజూరైందన్నారు. హౌసింగ్ ఎఇ భాస్కర్‌సతీష్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో అనుసంధాన రోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వ్యవసాయాధికారి ఉషారాణి మాట్లాడుతూ త్వరలోనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. రైతుభరోసా కింద రైతులు, కౌలు రైతులకు రూ.కోటి వరకూ విడుదలయ్యాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, భీమడోలు సొసైటీ అధ్యక్షులు రావిపాటి సత్యశ్రీనివాస్, వైస్ ఎంపిపి డోకల వాసంతి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి రామయ్య

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పెదపాడు

మండలంలోని కొక్కిరపాడు రైతుభరోసా కేంద్రం వద్ద జిల్లాలో మొట్టమొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పండిన ప్రతిఒక్క గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. అవసరమైన గోనె సంచులు సరఫరా చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం పేర్కొన్న నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం విక్రయాలకు సహకరించాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బత్తుల రత్నకుమారి, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ల సతీష్‌చౌదరి, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు గంటా ప్రసాదరావు, తహశీల్దార్ విజయ్‌కుమార్‌రాజు, సర్పంచి మరీదు రెడ్డియ్య, వ్యవసాయ శాఖ ఎడి సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌కుమార్, సివిల్ సప్లయిస్ టెక్నికల్ అసిస్టెంట్ షేక్ సల్మా పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిసుతన్న పద్మశ్రీ

విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన

నూజివీడు రూరల్ : పట్టణంలోని కళాశాల విద్యార్థులకు ఎపి కస్టమ్స్ సిజిఎస్‌టి బి.కమిషనర్ సాధు నరసింహారెడ్డి కెరియర్ అవేర్‌నెస్ సెమినార్ నిర్వహించారు. శుక్రవారం ఆడిటోరియంలో విద్యార్థులకు విద్యార్థి దశలో ప్రవర్తన తీరు, ఉద్యోగ బాధ్యతలతో ఎలా ముందుకు వెళ్లాలి, భవిష్యత్తును బంగారు బాటగా దిద్దుకునే విధానాన్ని పరిపూర్ణంగా ఏవిధంగా చేసుకోవాలి వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు.

నూతన ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

పోలవరం : స్థానిక పోలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.16 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆపరేషన్ థియేటర్‌ను జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ రేణుక, విజరం పిహెచ్‌సి డాక్టర్ మురళీధర్, డాక్టర్ వాసు, ఛైర్మన్ బి.సుమతి పాల్గొన్నారు.

యోగాసనంలో కైకరం విద్యార్థుల ప్రతిభ

ఉంగుటూరు : ఏలూరు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి యోగాసనాల పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారని హెచ్‌ఎం గుర్రం ప్రసాదరావు తెలిపారు. జూనియర్ బాయ్స్ విభాగంలో ఎం.రత్న రాజు ప్రథమ స్థానం, వసంతకుమార్ ద్వితీయ స్థానం, పి.జస్వంత్ తృతీయ స్థానం సాధించారు. సబ్ జూనియర్ బాయ్స్ విభాగంలో పి.షణ్ముఖ నాగరాజు ప్రథమ స్థానం సాధించి త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి యోగాసనాల పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి.నాగసుధ, ఇ.పాపయ్యలను అభినందించారు.

చింతలపూడిలో 'చిన్నారి భవిత'

చింతలపూడి : ఆడపిల్ల పుట్టిన దగ్గర నుంచి జీవితంలో స్థిరపడేవరకు అవసరమైన సహాయ సహకారాలు అందించటమే 'చిన్నారి భవిత' ముఖ్య ఉద్దేశమని సచివాలయం-1 మహిళా పోలీస్ ప్రియదర్శిని తెలిపారు. శుక్రవారం సెక్టార్ పరిధిలోని చింతలపూడి-1 ఎడబ్ల్యూసిలో చిన్నారి భవిత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

పోలవరం : అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ శాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సిబ్బంది మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన కర్నాటక లీడర్ ఐఎఫ్ఎస్ అధికారి పందిళ్ల పల్లి శ్రీనివాస్ చేసిన సేవలకు గాను ఆయన వనిపోయిన నవంబర్ 10వ తేదీన సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, రేంజ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొయ్యకు మద్దతు ధర కల్పించాలని నిరసన

కలిదిండి : రొయ్యకు మద్దతు ధర కల్పించాలని ఆక్వా రైతాంగానికి అండగా నిలవాలని రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మట్టగుంటలో రొయ్యకు మద్దతు ధర కల్పించాలని ఆక్వా రైతులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యులు రత్నారావు, భోగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రముఖ దస్తావేజు లేఖరి సుబ్బారావు మృతి

కలిదిండి : ప్రముఖ దస్తావేజు లేఖరి అడవి వెంకట సుబ్బారావు(68) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కాగితాల సుబ్బారావుగా ఆయన నియోజకవర్గ స్థాయిలో సుపరిచితులు. కైకలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లేఖరిగా గత 35 ఏళ్ల నుంచి పనిచేశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పలువురు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా విక్రేతపై కేసు

టి.నరసాపురం : నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బందివారిగూడెం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి మూడు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జీలుగుమిల్లి : కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం పి.రాజవరం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గారపాటి సుబ్బారావు(45) కుటుంబ కలహాలతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి అతడిని హుటాహుటిన జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మహిళను హతమార్చిన ప్రియుడు

పోలవరం : మండలంలో మహిళ హత్య సంచలనం రేకెత్తించింది. వివరాల్లోకి వెళ్తే పోలవరంలోని బాపూజీ కాలనీలో సంకురు బుజ్జమ్మ(35) మహిళ నివాసం ఉంటుంది. బుజ్జమ్మ భర్తకు దూరంగా ఉంటూ షేక్ సుభాని అనే వ్యక్తితో వివాహేతర సంబంధాన్ని గత పది సంవత్సరాలుగా కొనసాగిస్తుంది. మహిళపైన షేక్ సుభాని విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి హతమార్చాడు. అనంతరం నిందితుడు పోలీసు స్టేషన్‌కి వెళ్లి లొంగిపోయాడు. హత్యకు గల కారణాలు తెలియలేదు. పోలవరం సిఐ కె.విజయబాబు, ఎస్ఐ పవన్ కుమార్ సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.



విజయలక్ష్మికి నివాళులర్పిస్తున్న నేతలు

మహిళా సమస్యలపై పోరాడిన నేత

ఐద్వా నేత జి.విజయలక్ష్మి వర్ధంతి సభలో నేతలు

ఏలూరు అర్బన్ : జిల్లాలో మహిళా సమస్యలపై అనేక పోరాటాలు చేసిన నేత గొట్టిపాటి విజయలక్ష్మి అని ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమవతి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఐద్వా జిల్లా కార్యాలయంలో జిల్లా పూర్వపు కార్యదర్శి జి.విజయ లక్ష్మి వర్ధంతి సభ శ్రామిక మహిళా నాయకులు కె.విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఐద్వా జిల్లా కార్యదర్శిగా విజయలక్ష్మి పని చేశారని గుర్తు చేశారు. జిల్లాలో మహిళలపై జరిగిన దాడులు, అత్యాచారాలపై ఆందోళనలు చేశారన్నారు. ఇబ్బందుల్లో ఉన్న మహిళల కోసం ఏలూరు ఐద్వా ఆఫీస్‌లోనే లాయర్లతో ఉచిత మహిళా న్యాయ సహాయ కేంద్రం నడిపారని తెలిపారు. విజయలక్ష్మి స్వతహాగా గాయని అని, మహిళలను ఉద్యమంలో ఉత్సాహ పరుస్తూ పాటలు పాడేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐవిజి విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ నిర్వాహకులు లక్ష్మి, చందన, జాహ్నవి, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం : జెడ్‌పిటిసి

చింతలపూడి : ఖరీఫ్ సీజన్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవటం వల్ల వరి పొలాల్లో పంటలు ఎండిపోయాయని, బోర్లలో నీరు సరిగ్గా రాకపోవటం వల్ల పంట ఎండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని చింతలపూడి జెడ్‌పిటిసి మొలుగుమాటి నీరజాసుధాకర్ తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరిపంట ఎండిపోయిన రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువుల్లో పూడిక తీయిస్తామని, వర్షపు నీరు పొదుపు చేసి రైతులకు నీరు అందించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎఒ మీనాకుమారి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బ్యాంక్ మేనేజర్ జగన్మోహనరావు

మెరుగైన సేవలందించడమే ధ్యేయం

ఆగిరిపల్లి : ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడమే ధ్యేయంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పనిచేస్తుందని ఆగిరిపల్లి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ మిరియాల జగన్‌మోహనరావు తెలిపారు. శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 105వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా ఆగిరిపల్లి యూనియన్ బ్యాంక్‌లో కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ మేనేజర్ వివి.సోమరాజు, ఆర్‌డిఒ కె.అరవింద్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

టి.నరసాపురం : మండలంలోని అప్పలరాజుగూడెంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు శంకుస్థాపన చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారంలో భాగంగా పోలవరం నియోజకవర్గం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు దృష్టికి తీసుకెళ్లడంతో రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జల్లా మూర్తి, ఎంపిటిసి కర్రీ రామ్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పేరుతో మోసం

వైసిపి నగర పంచాయతీ అధ్యక్షులు కొప్పుల నాగు

చింతలపూడి : గత ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ప్రజలని మోసం చేసిందని వైసిపి చింతలపూడి నగర పంచాయతీ పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు తెలిపారు. నగర పంచాయతీ సచివాలయం-1లో పల్లెకు పోదాం, ఆంధ్రకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపంచాయతీ-1 పరిధిలో లబ్ధిదారులు 15,049 మందికి రూ.46 కోట్ల 40 లక్షల 78 వేల 549 ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ సచివాలయ కన్వీనర్ నిమ్మగడ్డ దుర్గారావు గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలీఫ్, పంచాయతీ కమిషనర్ యన్.రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి పరీక్షలు

చాట్రాయి : మండలంలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షా అభియాన్ సౌజన్యంతో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించబడింది. 8, 9, 10 తరగతులకు చెందిన 60 మంది విద్యార్థులు చెకుముకి టెస్టులో పాల్గొన్నారు. ఇటువంటి టెస్టులు రాయటం ద్వారా విద్యార్థులలో సామాజిక స్పృహ, పోటీ పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలి, శాస్త్రీయ దృక్పథం ఏర్పడుతుందని జన విజ్ఞాన వేదిక నిర్వాహకులు తెలిపారు. చెకుముకి టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులందరికీ హెచ్‌ఎం జి.నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు చెకుముకి సర్టిఫికెట్లతో పాటు పాఠశాల తరపున కూడా బహుమతులు అందజేస్తామని హెచ్‌ఎం తెలిపారు.

ముసునూరు : విద్యార్థి దశలోనే జ్ఞాన విజ్ఞాన వేదిక నిర్వహించడంతో విద్యార్థులు జ్ఞానోదయం కలిగి ఉంటారని ప్రిన్సిపల్ ఎ.సునీల తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎం సునీల ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రత్నమాల్, నాగేశ్వరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

గోనె సంచులు త్వరగా ఏర్పాటు చేయాలి

పోలవరం : ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి గోను సంచులు త్వరితగతిన ఏర్పాటు చేయాలని, తాళ్లపూడి మండలంలోని రైస్ మిల్లులను పోలవరం టాగ్ అయ్యే విధంగా చూడాలని వ్యవసాయ సలహా మండలి సమావేశంలో అధికారులను రైతులు కోరారు. పోలవరం-1 రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దత్తి రాంబాబు అధ్యక్షతన శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రైతులకు సంబంధించిన పలు ముఖ్యమైన విషయాలు చర్చించి తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎడి కె.రాంబాబు, ఆర్‌బికె ఛైర్మన్ పొన్నూరు నరసింహారావు, సిద్ధన వెంకటరత్నం, రైతులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ముదినేపల్లి : ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిని ఎం.శ్రీదేవి శుక్రవారం తెలిపారు. ఈనెల 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుల చరిత్రపై ఉపన్యాసాలు, వ్యాసరచన, 17న కవి సమ్మేళనం, 18న డిజిటల్ గ్రంథాలయంపై వ్యాసరచన, 19న మహిళా సాధికారత సదస్సు, 20న వారోత్సవాల ముగింపు, విజేతలకు బహుమతులు ప్రధానోత్సవం జరుగుతుందని ఆమె తెలిపారు.

ఘనంగా ప్రపంచ సైన్స్ దినోత్సవం

ముసునూరు : విద్యార్థులందరూ సైన్సులో అత్యధిక మార్కులు సంపాదించి అబ్దుల్ కలాం ఆజాద్ వలే కావాలని ప్రిన్సిపల్ కొండేటి విజయలక్ష్మి శౌరి మాస్టర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ముసునూరులో భారతీయ విద్యా నికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్న వెంకన్నను దర్శించుకున్న డిప్యూటీ సిఎం కొట్టు

ద్వారకాతిరుమల : చిన్న వెంకన్నను ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొండపైన ఎండబ్ల్యూ సోలార్ పవర్ ప్లాంట్, శివాలయం వద్ద గాలి గోపురంనకు శంకుస్థాపన, టెన్సయిల్ రూఫ్ షెడ్ అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్‌ను నియమించరూ..!

ప్రజలకు దూరమైన ఆయుర్వేద వైద్యం
మూడునెలలుగా డాక్టర్ లేమితో రోగుల ఇక్కట్లు

ఉంగుటూరు: మండలంలోని కాగుపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రికి మూడు నెలల నుంచి డాక్టర్ లేక ప్రజలు వైద్యసేవలకు దూరం అవుతున్నారు. డాక్టర్‌ను నియమించాలని వేడుకుంటున్నారు. ఇటీవల గ్రామపంచాయతీ రూ.3 లక్షలు, దాత సహకారం రూ.లక్ష, ప్రభుత్వ నిధులు రూ.4 లక్షలు కలిపి ఏడు లక్షలతో ఆసుపత్రిని అభివృద్ధి చేశారు. ఆసుపత్రిని చూస్తే ఎంతో సుందరంగా రూపుదిద్దుకుంది. రోగుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. కాగుపాడు ఆయుర్వేద డాక్టర్ లక్ష్మీ సౌజన్య, ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రికి ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. ఆమె డాక్టర్‌గా ఉండగా గ్రామంలో మెరుగైన వైద్యం అందించేవారు. మూడు నెలల క్రితమే డాక్టర్ లక్ష్మీ సౌజన్య బదిలీపై విజయవాడ వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ ఆసుపత్రికి వైద్యుడు లేక రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ హాస్పిటల్‌లో ప్రస్తుతం ఒక మహిళా సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు ఆయుర్వేద ఆసుపత్రికి డాక్టర్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి

ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు : కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ఎక్కువమంది హాజరై, ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా హాజరుకానున్న 8వ తరగతి విద్యార్థుల కోసం ఉచితంగా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు తమ విద్యను పేదరికం కారణంగా మధ్యలోనే నిలిపివేస్తున్నారన్నారు. అటువంటి ప్రతిభ కలిగిన విద్యార్థులు తమ విద్యను కొనసాగించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ మెరిట్ ఎగ్జామ్ ఏటా నిర్వహిస్తోందన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు రూ.48 వేల మెరిట్ స్కాలర్‌షిప్‌గా కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా అందించడానికి ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ తయారు చేసిన డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ రీ ఆర్గనైజ్డ్ టీచర్స్ యూనియన్ సేవలను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు జెడ్‌పి హై స్కూలు హెచ్‌ఎం, డెమొక్రటిక్ రీ ఆర్గనైజ్డ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, సేవాదళ్ నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలల గృహ నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలి

ఏలూరు : జిల్లాలో ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు ద్వారా నిర్వహిస్తున్న బాలల గృహాలకు జువెనైల్ జస్టిస్ ఆక్ట్ ప్రకారం ఇప్పటి వరకు ఏ విధమైన లైసెన్స్ తీసుకోకుండా నిర్వహిస్తున్న హోమ్‌ల వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని నోడల్ ఆఫీసర్ డి.దుర్గా ప్రసాద్, డిసిపిఒ డాక్టర్ సిహెచ్ సూర్య చక్రవేణి, ఛైర్‌పర్సన్, సిడబ్ల్యుసి రిబ్కా, రాణి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జువెనైల్ వెల్ఫేర్ శాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశానుసారం లైసెన్స్ పొందిన వారికి, వారి లైసెన్స్ కాలం పూర్తి అయిపోయిన వాటికి రెన్యూవల్ చేయడానికి, అసలు లైసెన్స్ పొందకుండా నిర్వహిస్తున్న గృహాలు ఉంటే వాటిని ప్రభుత్వ పరిధిలోకి తీసుకొచ్చి వాటి నిర్వాహణలో ఎటువంటి లోపాలు లేకుండా పిల్లలకు సరైన వసతులు కల్పిస్తూ వారి అభివృద్ధికి కృషి చేయటానికి సహకరించాలని కోరారు. జిల్లాలో గతంలో 106 హోమ్‌లు ఉన్నాయన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఈ తనిఖీలు జరుగుతాయని తెలిపారు. ఈ జిల్లా కమిటీలో ఆర్.రాజేష్, శ్రీకాంత్, జిల్లా బాలల సంరక్షణ యూనిట్ వారు పాల్గొన్నారు.

సింహాద్రి సేవలు అభినందనీయం

భీమడోలు : మండల పరిషత్ కార్యాలయం ద్వారా చేపట్టిన, అమలు చేసిన సంక్షేమ, ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా కొనసాగటానికి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్.సింహాద్రి(శంకర్) అందించిన సేవలు అభినందనీయమని భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు కనమాల రామయ్య తెలిపారు. భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేసిన సింహాద్రి ఉద్యోగోన్నతిపై నల్లజర్ల మండలం పంచాయతీ విస్తరణాధికారిగా ఇటీవల కాలంలో బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు, కార్యాలయ అభివృద్ధి అధికారి పద్మావతి దేవిల ఆధ్వర్యంలో శుక్రవారం భీమడోలు కార్యాలయంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ తన ఉద్యోగ కాలంలో తనకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శ్రీనివాసరావు, కె.రాజుతో పాటు పంచాయతీ కార్యదర్శి ఎం.ఠాగూర్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నివారించాలి

ఏలూరు టౌన్ : సామాజిక బాధ్యతతో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక తెలిపారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఏలూరు ఆదివారపు పేటలోని ది సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చి ప్రాంగణంలో మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాప్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, అంతేకాక మన నిత్యజీవితంలో చాలా మంది విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలైపోతున్నారని తెలిపారు. అనంతరం నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్.జాకబ్ రాజు మాట్లాడుతూ జిల్లాలోని నూజివీడు మండలం పొనసానిపల్లిలో ఈచికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ ఏర్పాటు చేసిన బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్‌ని సంప్రదించాలన్నారు. ఇలాంటి సమస్యలతో ఉన్న విద్యార్థులు, యువత 9490492020 నెంబర్‌కు సంప్రదించాలన్నారు. అనంతరం ది సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చి మేజర్ జల్లి మోషే మాట్లాడుతూ సంఘ సభ్యులకు ఈ అవగాహన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ వర్క్‌షాప్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు నవజీవన్ బాల భవన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ బి.నెహేమియా, డి.రజిత, ది సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చి మేనేజర్ జి.జాకబ్, యం.ఫ్రాన్సిస్, చర్చి పాస్టర్, సభ్యులు పాల్గొన్నారు.



ముసునూరులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

పలుచోట్ల 'వై నీడ్ ఎపి జగన్'

ముసునూరు : సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందరిని ఆదుకుంటున్నారని జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కోటగిరి రాజానాయనలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రమణక్కపేట గ్రామ సచివాలయం నందు పల్లెకు-పోదాం కార్యక్రమంలో భాగంగా సంక్షేమపథకాల బోర్డును ఆవిష్కరించారు. సర్పంచి రంగు ధనలక్ష్మి గాంధీ, ఎంపిటిసి కొండా దుర్గాభవానీల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి జగన్ సిఎం అయితే మరెన్నో పథకాలు ప్రవేశపెడతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పాముల గంగధరరావు సర్పంచులు పేరం కృష్ణ, వైసిపి నాయకులు కంభాల రాంబాబు, ఎఒ కూచిపూడి సాయిరామ్, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని వడాలిలో గురువారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమానికి ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతో పాటు ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపినే గెలిపించి మరోసారి జగన్‌ని ముఖ్యమంత్రిని చేయాలని ఎంఎల్ఎ డిఎన్ఆర్ తనయులు దూలం శ్యామ్ ఫణి కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశరమ్మ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలోని 16వ సచివాలయం పరిధిలో శుక్రవారం రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ మేక వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఆగిరిపల్లి జెడ్‌పిటిసి పిన్నిబోయిన వీరబాబు తెలిపారు. సచివాలయం-1లో శుక్రవారం సాయంత్రం వైసిపి ఆధ్వర్యంలో వై ఎపి నీడ్ వైఎస్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.అనూష, వైసిపి నాయకులు పి.నరసింహారావు పాల్గొన్నారు.

ఉంగుటూరు : గత ప్రభుత్వానికి, జగన్ ప్రభుత్వానికి తేడాను గుర్తించి, సంక్షేమ పథకాలు ఎంత పారదర్శకంగా అందిస్తున్నారో ప్రజలు గమనించాలని వైసిపి మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు తెలిపారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అక్కుపల్లి గోకవరంలో సర్పంచి మిద్దే సత్యవతి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంగారావు మాట్లాడుతూ గ్రామానికి ఇంత వరకూ అందించిన సంక్షేమం, అభివృద్ధి పనుల వివరాలను సభకు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి షంషుద్దీన్, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, విజయనిర్మల పాల్గొన్నారు.



ఉంగుటూరులో మాట్లాడుతున్న మంగారావు

అల్లూరులో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ'

ముదినేపల్లి : మండలంలోని అల్లూరులో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం బాబుకు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నీలిపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు శిక్షణ

ముసునూరు : ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమానికి జెడ్‌పిహెచ్ఎస్ ముసునూరు పాఠశాలలో కోఆర్డినేటర్‌గా వాలంటీర్లకు శిక్షణా తరగతులు నిర్వహించినట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం పాల్గొన్నారు.

ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC) పోయినది

TALUPURI VARA PRASAD అను నాకు DUBAI రాయబార కార్యాలయం అధికారులు ది.01-07-2020న X0804710 నెంబరుగల ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC) మంజూరు చేసారు. సదరు EC జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది. 1-11-2023న మా ఇంటి నుండి భీమవరం పట్టణం బ్యాంక్ కాలనీ వెళ్ళుచుండగా నా ఒరిజినల్ EC పోయినది. గాన నా ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC) ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను

TALUPURI VARA PRASAD
S/o. T. Uma Maheswara Rao
D.No. 19-25-3, Near Krishna Devaraya
Kalyana Mandapam, Reddy Colony-1
BHIMAVARAM-534201, W.G.D., A.P.

CHANGE OF NAME

I, MAMIDI VENKATA RATNA PRASAD S/o. Hanumaji Rao Resident of D.No. 13-30-1/1, Mamidi Vari Street, Tadepalligudem Town, W.G.Dist, A.P. I Have Changed My Name MAMIDI VENKATA RATNA PRASADU (OLD NAME) to MAMIDI VENKATA RATNA PRASAD (NEW NAME). Hence forth Iam being called as MAMIDI VENKATA RATNA PRASAD (NEW NAME) For all Purpose

దస్తావేజులు పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా, గణపవరం మండలం, గణపవరం గ్రామ కాపురస్తులైన పెరుమళ్ళ వెంకటరావు గారి కుమారుడు వెంకటసాయి మనోహర్ అను నాకు డాక్యుమెంట్ నెంబర్ 2186/2001 (SRO, గణపవరం) ఒరిజినల్ డాక్యుమెంట్ గణపవరం SBI సెంటర్ నుండి జిరాక్స్ తీయించుకుని మా ఇంటికి వెళుతుండగా డాక్యుమెంట్ ఉన్న కవర్ మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబ్‌కి తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.

పెరుమళ్ళ వెంకట సాయి మనోహర్
S/o. వెంకటరావు
గణపవరం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 81121184508

లింక్ దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, సగ్గూరు వాస్తవ్యులు కొండవరదల (లేట) రామకోటయ్య గారి కుమారుడు కొండవరదల శ్రీనివాసరావు పేరన సగ్గూరు గ్రామంలోని ఆర్.యస్. నెం. 57/1లో య. 0.46 సెంట్లు మరియు ఆర్.యస్. నెం. 57/2లో య. 0.90 సెంట్లు వెరశి య. 1.36 సెంట్లు భూమికి సంబంధించిన లింక్ దస్తావేజు (నెం. 156/1977) పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

కొండవరదల శ్రీనివాసరావు
(తండ్రి) రామకోటయ్య
సగ్గూరు గ్రామం, ఆగిరిపల్లి మండలం
ఏలూరు జిల్లా, సెల్: 8977172369

పదవ తరగతి మార్కులిస్ట్ పోయినది

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఎరిచెర్ల రత్నాకర్‌రావు అను నేను 15-10-2023 తేదీన నా పదవ తరగతి ఒరిజినల్ మార్కు లిస్ట్ నెం. 356888 ఇంటి దగ్గర నుంచి జిరాక్స్ షాపునకు తీసుకొని పెంటపాడు వెళుతున్న సమయంలో దారి మధ్యలో జారి పడిపోయినాయి. కావున పైన తెల్పిన ఒరిజినల్ టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్ ఎవరికైనా దొరికినచో వెంటనే నాకు అందజేయవలెను. అట్లు అందించిన వారికి మంచి బహుమతి ఇవ్వబడునని ఇందు మూలంగా తెలియజేయుచున్నాను.

అడ్రస్: ఎరిచెర్ల రత్నాకర్‌రావు
S/o. కృష్ణ, చింతపల్లి గ్రామం
పెంటపాడు మండలం
పశ్చిమగోదావరి జిల్లా (ఎపి)
పిన్: 534196, సెల్: 9391865732

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తణుకు, ప॥గో॥జిల్లా వారి కోర్టులో
ఓ.యస్. నెం. 16/2021

బిట్వీన్:
నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి -వాది
మరియు
గుడిమెట్ల గోపాలకృష్ణారెడ్డి వగైరా -ప్రతివాదులు

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

1వ ప్రతివాది: గుడిమెట్ల గోపాలకృష్ణారెడ్డి, తండ్రి: గంగిరెడ్డి, డోర్ నెం. 3-107, శివాలయం వీధి, మల్లిపూడి - 534124, పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా, తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు.

పై నెంబరు దావా మీ వగైరాలపై ది. 3-1-2018వ తేదీ ప్రాంశరీ నోటు ఆధారంగా రూ. 9,22,897/-లు వసూలు కావలెనని కోరుచూ దాఖలు చేయగా దావా సమను మీరు కావాలని అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ చేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున మీరు ఈ ప్రకటన తేదీ నుండి 30 రోజుల లోపుగా శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల సదరు దావా మీ పరోక్షము నందు తీర్మానం జరుగునని ఇందుమూలంగా తమకు తెలియజేయడమైనది.

వాయిదా తేదీ: 17-11-2023

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
తణుకు అడ్వకేట్స్, తణుకు
ది.10-11-2023 సెల్: 9390018122

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తణుకు, ప॥గో॥జిల్లా వారి కోర్టులో
ఓ.యస్. నెం. 433/2022

బిట్వీన్:
జక్కంపూడి వెంకటేశ్వరరావు -వాది
మరియు
కవురు సుధాకర్ -ప్రతివాది

వాది తరపున దాఖలు చేసిన ప్రకటన

ప్రతివాది: కవురు సుధాకర్, తండ్రి: లేటు సత్యనారాయణ, డోర్ నెం. 22-71, ప్రకాశం రోడ్, అంబేద్కర్ కాలనీ, వేల్పూరు-534222, తణుకు మండలం, ప॥గో॥జిల్లా. తణుకు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు

పై నెంబరు దావా మీపై 2 ప్రాంశరీ నోట్ల ఆధారంగా మీ నుంచి రూ. 3,35,260/-లు వసూలు కావలెనని కోరుచూ దాఖలు చేయగా మీరు దావా సమన్లు కావాలని అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ చేయవలసినదిగా ఆర్డరు వేసినారు. కావున మీరు ఈ పబ్లికేషన్ తేది నుండి 30 రోజులలోపుగా శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అవ్వక తప్పిపోయిన ఎడల సదరు దావా మీ పరోక్షమునందు తీర్మానం జరుగునని ఇందుమూలంగా తమకు తెలియజేయడమైనది.

వాయిదా తేదీ: 20-11-2023

శ్రీ గోటేటి భాస్కరమూర్తి
శ్రీ గోటేటి సత్య వెంకట వరప్రసాద్
తణుకు అడ్వకేట్స్, తణుకు
ది.10-11-2023 సెల్: 9390018122

మహారాజశ్రీ కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు
O.S.No.186/2023

Between:
బాగం ఉమామహేశ్వర రావు ...వాది
మరియు
1)మాగంటి వెంకటలక్ష్మీ
2)జంగలి సత్యవతి
3)మాగంటి రామలక్ష్మీ
4)మద్దుల సునీత ...ప్రతివాదిలు
To,
1)మాగంటి వెంకటలక్ష్మీ, భర్త: లేటు బాబురావు, వయస్సు: 58 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.1-01సి, తాటికాకుల గూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా
2)జంగలి సత్యవతి, భర్త: సురేష్, వయస్సు: 40 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.1-02, తాటికాకుల గూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా
3)మాగంటి రామలక్ష్మీ, భర్త:సిద్దు, వయస్సు: 36 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.1-01సి, తాటికాకుల గూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా
4)మద్దుల సునీత, భర్త:శ్రీనివాస్, వయస్సు: 34 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: బండివారిగూడెం గ్రామం, జీలుగుమిల్లి మండలం, ప.గో.జిల్లా

వాది మీపై పైన తెలిపిన దావా దాఖలు చేసియున్నారు. దావా పై మీకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో మీరు ది.24-11-2023 తేదీన ఉదయం 10-30 గం॥లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ లేదా మీ ప్లీడర్ గారి ద్వారా గానీ హాజరై అభ్యంతరములు చెప్పుకోగలరు. లేనియెడల మీ పరోక్షములో తీర్మానం చేయబడుతుందని తెలియజేయడమైనది.

//కోర్టు వారి అనుమతితో//
వాయిదా:24-11-2023
కొత్తగూడెం,
08-11-2023

ఇట్లు
లక్కినేని సత్యనారాయణ,
న్యాయవాది-కొత్తగూడెం